క్లుప్తంగా

బీఎల్‌ఓలకు శిక్షణ



కాటారం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం కాటారం, మహాముత్తారం బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. ఓటరు జాబితా తయారీ, నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం, మహాముత్తారం తహసీల్దార్లు నాగరాజు, శ్రీనివాస్, న యాబ్ తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఈనెల 26న ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఐ ఆవిర్భవించి 99 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని శాఖలలో జెండాలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కోరారు.

వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 84 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 28 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పీసా గ్రామసభ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామచంద్రాపురంలో మంగళవారం ఇసుక క్వారీ నిర్వహణకు అధికారులు పీసా గ్రామ సభను సర్పంచ్ అట్టం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. మొత్తం 473 మంది సభ్యులకు 354 మంది హాజరయ్యారు. ఇసుక క్వారీ నిర్వహణను శ్రీ కనకదుర్గ గిరిజన ఇసుక క్వారీ మహిళ పరస్పర సహాయ సంఘంకు అప్పగించేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో పీసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ హనుమంతరావు, ఎంపీటీసీ సాంబశివరావు, పీసా కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

దళిత బంధు అందజేయాలి



ఏటూరునాగారం: గత ప్రభుత్వంలో దళితులకు జాబితాల్లో దళితబంధు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే దళితబంధు రుణాన్ని అందజేయాలని లబ్ధిదారులు బెడిక రమేష్, కాళ్ల రామకృష్ణ, కొండాయి చిన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. తమకు అక్టోబర్ 2023లో దళిత బంధు మంజూరైందని అప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున వాటిని నిలిపివేశారన్నారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చిందని, దళితబంధు పేరిట మంజూరు అయిన నిధులను తమకు ఇవ్వాలని కోరారు. రాజు, శ్రీరాం, రవీందర్, చంద్రబాబు, బోజారావు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

మల్హర్: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 2022 నుంచి 2023 మార్చి31 వరకు నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో జరిగిన అక్రమాలపై ఏపీఓ, ఈసీ, టీఏ, కార్యదర్శుల వద్ద నుంచి రూ.61,812 రికవరీకి అడిషనల్ డీఆర్డీఓ అవినాష్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ వింగ్ అధికారి రుబినా బేగం , సీనియర్ క్వాలిటీ అధికారి కేతావత్ దరం సింగ్, శ్రీనివాస్, ఎంపీఓ విక్రమ్, ఏపీఓ హరీష్, ఉపాధిహామీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరం పాటుపడుదాం..

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్లపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రాజకీయం ఓట్లప్పుడు చేసుకుందాం అభివృద్ధికి అందరం పాటుపడదామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన పలు గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్ట్ షాపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని మూసివేయాలని, అర్హులైన పెన్షన్ దారులకు గత కొన్ని సంవత్సరాలు నుంచి పెన్షన్ రావడం లేదని, సదరం క్యాంపులు కూడా ఏర్పాటు చేయడం లేదని సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బెల్టు షాపులను మూసి వేయాలని సభలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి కొత్త పెన్షన్లు ఎంపిక చేయడం జరుగుతుందని ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులను అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం అర్హులైన నిరుపేదలకు తప్పనిసరిగా అందేలా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటూ, కృషి చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో 100 పడకల ఆస్పత్రిలో సిటి స్కానింగ్, ఎంఆర్‌ఐ స్కానింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. బస్సులు నడవని గ్రామాలను గుర్తించి రోడ్డు మరమ్మతులు చేపట్టి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారిగా మండల సభకు రావడంపై పలు శాఖల అధికారులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీపీఓ ఆశాలత, పీడీ పురుషోత్తం, సీపీఓ సామ్యెల్, మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ కృష్ణవేణి, జెడ్పీటీసీ సదయ్య, పీఏసీఎస్ చైర్మన్ నరసింగరావు, వైస్ ఎంపీపీ రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే..

మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మెనూ ప్రకారం భోజనం అందించాలని ఉపాధ్యాయులను సూచించారు.

బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి



మహాముత్తారం: మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్



మల్హర్‌లో..

మహాముత్తారం: బ్యాంకులో ప్రతి ఒక్కరూ ఖాతా కలిగి ఉండాలని మహాముత్తారం తెలంగాణ బ్యాంకు మేనేజర్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని కనుకునూర్ గ్రామంలో గ్రామస్తులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ కారక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క బ్యాంక్ ఖాతాదారులు పీఎంజేజేబీవై ఏపీవై లాంటి ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, రాజేష్, సీఎస్‌పీ రాజు పాల్గొన్నారు.

మల్హర్: తాడిచర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ అందిస్తున్న సేవలు బీమా, సామాజిక భద్రత పథకాలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కళాజాతా వారిచే మాటలు, పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్‌రావు, కళాజాతా సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కాటారం: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీల్లో మండలంలోని మేడిపల్లి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. అండర్ -16 బాలికల విభాగంలో నిర్వహించిన రెండు కిలోమీటర్ల పరుగుపందెంలో పాఠశాలకు చెందిన ఎం.వైష్ణవి, వి.శ్వేత ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అసిఫాబాద్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా ఖోఖో విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన బి.అపర్ణ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, పిడి వీరన్న, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, శైలజ, దివ్యశ్రీ, శిరీష, పూర్ణచందర్, సంపత్, పురుషోత్తం, రమ, రజిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మహాముత్తారం: ఉపాధిహామీలో పనిచేసే కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో 50మంది కూలీలకు తగ్గకుండా పనికి వచ్చేలా చూడాలని సూచించారు. ప్రతీ గ్రామంలో నర్సరీల్లోని బ్యాగుల్లో ఎర్ర మట్టిని నింపి విత్తనాలు నాటడానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కుమారస్వామి, ఈసీ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తొలిమెట్టును పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

గోవిందరావుపేట: తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పస్రా ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇంటింటా చదువుల పంట అనే కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు మొబైల్‌లో స్విఫ్ట్ చాట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పమ్మిరెడ్డి, కుమార్, బాబు, పాపయ్య, సారయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కన్నాయిగూడెం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే మద్దతు ధర లభిస్తుందని ఎంపీపీ జనగాం సమ్మక్క అన్నారు. మండలంలోని గూర్రేవులలో ఓరుగల్లు సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉప సర్పంచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్టెం శ్రీనువాస్, "సెంటర్ ఇన్‌చార్జ్ పూజారి వెంకటేష్, మటం వెంకటేష్, సత్యనారాయణ, జగన్, సుమన్, వెంకటయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ క్రైంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం వర్టికల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పంగిడిపల్లిలో సైబర్ క్రైం, డయల్ 100పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ ఫోన్లకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి పర్సనల్ లోన్ల పేరుతో మెసేజ్, ఫేక్ ఆప్‌లను పంపిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తీసుకుని మన ఖాతాల్లోని నగదును పూర్తిగా స్వాహా చేస్తారని అన్నారు. కావున గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని తెలుపరాదని, ఎలాంటి ఓటీపీలు చెప్పరాదని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి నగదును పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు సుమన్, రాజు, సంతోష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వివేక్, కమిటీ సభ్యులు

చిట్యాల: ప్రముఖ సినీ గేయ రచయిత, కవి గాయకుడు మిట్టపల్లి సురేందర్ తండ్రి మిట్టపల్లి నర్సయ్య వర్ధంతి సందర్భంగా మిట్టపల్లి మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వివేక్, ఆస్పత్రి సిబ్బంది విజయకుమారి, కట్కూరి రాణి, స్వాతి, ఉదయశ్రీ, కల్యాణ్, మహేందర్, శ్రీకాంత్, రాజయ్య, కమిటీ సభ్యులు సదయ్య, వినోద్, ప్రశాంత్, శైలేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన శివారపు జనార్దన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బట్ట మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు మంచెర్ల నాగేశ్వరరావు క్వింటా బియ్యాన్ని అందజేశారు. జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బట్టగోపి, మండల ప్రధాన కార్యదర్శి ఇర్సవడ్ల కిరణ్, నాయకులు బండారి రాము, నాగరాజు, కొమరయ్య, రాంబాబు, పెద్ద బోయిన సమ్మయ్య, మాటూరి పాపయ్య, నారాయణ, గౌరయ్య, కొంకతి కృష్ణ, కొంకతి వెంకట్, నర్సయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

అనుమతి పత్రాలు కలిగి ఉండాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై రమేష్

చిట్యాల: వాహనదారులు వాహనాల అనుమతి పత్రాలను తప్పకుండా కలిగి ఉండాలని ఎస్సై జంగిలి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. అనుమతి పత్రాలు లేని వారికి జరిమానా వేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మిర్చి తోటను పరిశీలిస్తున్న రమేష్

మల్హర్: మిరప తోటలో బూడిద తెగులు నివారణకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మహదేవపూర్ ఉద్యానవాన శాఖ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని నాచారం, అన్సాన్‌పల్లి గ్రామాల్లో మిరపలో ఆశిస్తున్న తామర పురుగు ఉధృతి, సూక్ష్మదాతు లోపలపైన రమేష్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరపలో బూడిద తెగులు, కాయకుళ్లు ఆశించుటకు ఆస్కారం ఉందని తెలియజేశారు. వీటి నివారణకు అజాక్సిస్ట్రోబిన్ 1మి.లీ లేదా మైక్లోబ్యుటానిక్ 0.4 గ్రా. లేదా అజాక్సిస్ట్రోబిన్ 11శాతం, టేబ్యుకోనజల్ 18.3 శాతం ను 1.2 మి.లీ లేదా టేబ్యుకోజనల్ 50శాతం , ట్రిఫ్లాక్సీస్ట్రోబిన్ 18.2శాతం డైఫెనోకోజోనల్ 50శాతం, ట్రిఫ్లాక్సీ స్ట్రోబిన్ 25శాతం 0.5 మిలీ లేదా అజాక్సిస్ట్రోబిన్ 18.2శాతం, డైఫెనోకోనజోల్ 11.4శాతం1మి.లీ లేదా ప్రోక్లోరాజ్ 24.4శాతం, టేబ్యుకోనజోల్ 12.1శాతం 2మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి 8 నుంచి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్

చిట్యాల: ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5, 6న జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వంద మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్ పోటీలను నిర్వహించే వాల్‌పోస్టర్లను ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ వేల్పుల రాజ్‌కుమార్ మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల, ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల డిసెంబర్ 26న లోపు పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. క్రీడాకారులు పూర్తి వివరాలకు సెల్ నంబర్ 7287920310కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్, కార్తీక్, సునీల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యానికి తగిన అవకాశాలు



ఎమ్మెల్యేకు జ్ఞాపికను ఇస్తున్న శ్యామ్‌సుందర్

భూపాలపల్లి అర్బన్: ఉపాధి అవకాశాలపై యువతకు వారి నైపుణ్యానికి తగిన అవకాశాలు కల్పించనున్నట్లు సహస్ర ఎడ్యుకేషనల్ సొసైటీ ఎండీ పులిపాటి శ్యామ్‌సుందర్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే సత్యనారాయణరావును కలిసి జ్ఞాపికను అందజేసి సొసైటీ ఆధ్వర్యంలో అందిచే సేవ కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు, నిరక్షరాస్యులైన రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అనుసరిస్తూ నూతన ప్రత్యామ్నయ పంటలు పండిచే పద్ధతులు, పంట పండించే విధానంలో మెలకువలు, పరిశ్రమలు, వాటి అనుబంధ సంస్థల ఏర్పాట్లపై అవగాహన కల్పించి ఉపాధి మార్గాలు చూపించనున్నట్లు తెలిపారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గండ్ర దంపతులు

గణపురం: మండలకేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణ 14వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5గంటలకు కాకడ హారతి, 7 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం,అష్టోత్తర శతనామార్చన, సహస్ర నామార్చన అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి అనంతరం అయ్యప్ప మాలధారులకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6.15 గంటలు సాయంత్ర హారతి నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండలానికి చేరిన రామయ్య అక్షింతలు



ర్యాలీగా వస్తున్న సంఘ్ సభ్యులు, భక్తులు

ఏటూరునాగారం: శ్రీ రామ జన్మభూమి అయోధ్య నుంచి పవిత్రమైన శ్రీరాముని అక్షింతలు మంగళవారం ఉదయం ఏటూరునాగారం చేరుకున్నాయి. దీంతో రామాలయ కమిటీ, ఆర్ఎస్ఎస్ ఖండ వ్యవస్థ ప్రముఖ సంఘ్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో స్వామివారి అక్షింతలు, కరపత్రాలను ర్యాలీగా వచ్చి రామాలయంలో భద్రపరిచారు. 2024 జనవరి 22న అయోధ్యలో శ్రీ సీతారాముల మందిర పునఃప్రతిష్ఠాపన జరగనుండడంతో దేశంలోని అన్ని రాష్ట్రాలకు శ్రీరాముని అక్షింతలు పంపిణీని బజరంగదళ్, ఆర్ఎస్ఎస్ తలపెట్టింది. జనవరి ఒకటి నుంచి 15వ తేదీ వరకు శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంటికి చేరే విధంగా కార్యచరణ ప్రారంభించనున్నారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు సమన్వయంతో ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ ఖండ వ్యవస్థ సంఘ్ నాయకుడు దామెర సమ్మయ్య అన్నారు. జనవరి 22న ప్రతిష్ఠాపన రోజు అక్షింతలను శ్రీరాముని చిత్రపటం ఇంటిలో ఏర్పాటు చేసుకొని దాని ఎదుట ఐదు దీపాలను వెలగించి అక్షింతలను తలపై వేసుకొని అయోధ్య రామయ్య ఆశీర్వాదం పొందాలని సంఘ్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ మోడెం రమేష్, శివాలయం చైర్మన్ తాడూరి రఘు, ఖండ వ్యవస్థ ప్రముఖ ఆర్ఎస్ఎస్ సంగ్ పోడెం రవీందర్, బొల్లం రజిని కుమార్, వైకుంఠం, పోగుల లక్ష్మీనారాయణ, అర్చకులు ఎల్లాప్రగడ సూర్యనారాయణ శర్మ, సుదర్శన స్వామి, రాజ్‌కుమార్ , ఉదయ చార్యులు, సంఘ్ సభ్యులు కత్తెర శీను, దీనబంధు స్వామి, అలవాల శ్రీను, చిత్తుబత్తుల సదానందం, ఇరుసవడ్ల భిక్షపతి, వీరన్న, వలస శ్రీను, నర్సింగరావు, ఇర్సవడ్ల భూమయ్య, అర్జున్, విజయ్, రవీందర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

రేపు తుడుందెబ్బ సమావేశం

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఈనెల 21న తుడుందెబ్బ మండల కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు గొరబోయిన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి కొప్పుల జగన్నాథరావు, జిల్లా కమిటీ సభ్యుడు పాయం కోటేశ్వర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు పొడెం బాబు, రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు కొప్పుల రవి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాడ్వాయి మండల తుడుందెబ్బ నూతన కమిటీని నియమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు, యూత్ సంఘం నాయకులు, మహిళలు హాజరుకావాలని కోరారు.